క్లుప్తంగా

మరిడిమాంబ పండగ పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: వెన్నలపాలెంలో ఈ నెల 30న మరిడిమాంబ గ్రామ దేవత పండగను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉత్సవాల గోడపత్రికను సర్పంచ్ వెన్నల అప్పారావు, గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. అదే రోజు రాత్రికి డ్యాన్స్ ధమాకా కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ కనకరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరానికి చెందిన ఎం. సోమశేఖర్‌రెడ్డి అనే దాత లక్ష 116 రూపాయిల విరాళం అందజేశారు. సింహగిరిపై దేవస్థానం తరపున దాతకు సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు.

ఆటోలో బంగారు ఆభరణాల చోరీ

పెందుర్తి: ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి నుంచి ముగ్గురు మహిళలు బంగారం చోరీ చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పెందుర్తి క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురం పోర్టుకాలనీలో నివాసం ఉంటున్న గంటా రవికుమార్ కొద్దిరోజుల కిందట కుటుంబంతో కలిసి ఊరు వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి వేపగుంట వద్ద ఆటో ఎక్కాడు. అదే సమయంలో మరో ముగ్గురు మహిళలు అదే ఆటో ఎక్కారు. ఆ మహిళలు చీమలాపల్లి వద్ద దిగిపోయారు. అయితే రవికుమార్ లక్ష్మీపురం వద్ద దిగేందుకు బ్యాగ్ చూసుకోగా జిప్ తీసి ఉన్నాయి. అందులోని ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పెందుర్తి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న సబ్బవరం పీహెచ్‌సీ సిబ్బంది

సబ్బవరం: మంచి పౌష్టికాహారంతో రక్తహీనతను నియంత్రించవచ్చునని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులకు వారి బరువు, ఎత్తుతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి మాట్లాడుతూ కూరగాయలు,పండ్లు,ఆకు కూరలు తీసుకోవాలన్నారు. ఆహారంలో చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

గ్రామ సర్వేయర్ల రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా మస్తాన్‌వలీ



మస్తాన్‌వలీ శ్రీనివాస్

పెందుర్తి: గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా రాంపురం గ్రామ సర్వేయర్ మస్తాన్ వలీ ఎన్నికకాగా, జిల్లా కో ఆర్డినేటర్‌గా పట్నాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమవేశంలో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మస్తాన్ వలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేలో తాము భాగస్వాములు అయినందుకు సంతోషంగా ఉందన్నారు. గ్రామ సర్వేయర్ల శ్రేయస్సు కోసం పనిచేస్తామని చెప్పారు. వలీ, శ్రీనివాస్‌కు మండలంలోని పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆహ్లాదం → ఆరోగ్యం → ఆనందం

నాడు

గత ప్రభుత్వంలో కాలనీల్లో పార్కులంటే పిచ్చి తుప్పలు..దొంకలతో నిండిన ఖాళీ స్థలం.. అక్కడక్కడా కాలనీవాసులు ముందుకు వచ్చి పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసుకుంటే ఆ పార్కుల్లో పిల్లలకు ఆటవిడుపుతో కూడిన ఆహ్లాదం..పెద్దలకు సాయంత్రం పూట కాస్త కాలక్షేపం..అంతకు మించి పార్కుల్లో చూడ్డానికి ఏమీ లేని పరిస్థితి.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలనీల్లోని పార్కులను అభివృద్ధి చేసింది. ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. పిచ్చి మొక్కలు తొలగించి ఆహ్లాదం పంచేలా నందనవనాల్లా రూపురేఖలు మార్చింది. రూ.కోట్ల నిధులు జీవీఎంసీ ద్వారా విడుదల చేసి పార్కులను అత్యాధునికంగా తీర్చిదిద్దుతుంది. ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్‌లతో పాటు పిల్లలు పెద్దల వ్యాయామానికి వీలుగా పరికరాలు ఏర్పాటు చేసింది.

- పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- జీవీఎంసీ సారథ్యంలో వ్యాయామ పరికరాలు
- ఐదేళ్ల పాటు జిమ్‌ల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దే
- సర్వాత్రా హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

లక్షలాది రూపాయలతో ఓపెన్ జిమ్‌లు

- జీవీఎంసీ 97వ వార్డు సత్యానగర్, ఎస్సీబీసీ కాలనీల్లో రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో నాలుగు పార్కుల్లో మొత్తం రూ.25 లక్షల వరకు నిధులు విడుదల చేసి ఓపెన్ జిమ్ సౌకర్యం కల్పించారు.
- చినముషిడివాడ వుడాకాలనీలో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేశారు.
- షిప్‌యార్డ్ లేఅవుట్, మైత్రినగర్, అప్పన్నపాలెం, గోశాల కూడలి, భరత్‌నగర్‌లలో ఒక్కో జిమ్‌కు రూ.5 లక్షల వరకు జీవీఎంసీ కేటాయించింది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఓపెన్ జిమ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి.



ఓపెన్ జిమ్ ఉన్న విశాలమైన సత్యానగర్ పార్కు



ఇది కదా అభివృద్ధి

పెందుర్తి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. దీనికి కోసం పార్కుల అభివృద్ధి చేయడంతో పాటు అందరికీ అందుబాటులో ఉండేలా జిమ్‌లు ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా జిమ్ సామగ్రి ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో వ్యాయామాలు చేసుకుని ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం మరిన్ని ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తుంది.

శరవేగంగా..

జీవీఎంసీ విలీన కాలనీల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రజల ఆసక్తిని, అవసరాన్ని గుర్తించి కాలనీల్లో పార్కులను జీవీఎంసీ అధికారులు ఎంపిక చేస్తున్నారు. ఈ క్రమంలో పార్కు/ప్రత్యేక స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన రోజుల వ్యవధిలోనే జీవీఎంసీ నుంచి ఒక్కో జిమ్ ఏర్పాటుకు కనీసం రూ.5 లక్షల నిధులు విడుదల చేస్తుంది. వెనువెంటనే జిమ్ పరికరాలను అమరుస్తున్నారు. ఆయా జిమ్‌లలో ఏ పరికరాన్ని ఎలా వినియోగించాలి..ఎన్ని క్యాలరీలు ఖర్చు అవుతాయన్న వివరాలతో(ప్రైవేటు జిమ్‌లో ట్రైనర్ తరహా) డిజిటల్ క్యూ ఆర్ బోర్డు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు వీటి నిర్వహణ బాధ్యతలను ఐదేళ్లపాటు సదరు కాంట్రాక్టర్‌కే అప్పగిస్తూ కఠిన నిబంధనలు నిర్దేశించారు. దీంతో ఓపెన్ జిమ్‌లలో పరికరాలు మరమ్మతులకు గురైనా వెంటనే సమస్య పరిష్కరిస్తున్నారు.



సుజాతనగర్ బి-జోన్ ఓపెన్ జిమ్‌లో కసరత్తులు చేస్తున్న కాలనీ వాసులు



జిమ్ పరికరానికి మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్

అభినందనీయం



మా ప్రాంతంలో పార్కును 2022లో రూ.2 కోట్ల ప్రభుత్వ నిధులతో సుందరంగా అభివృద్ధి చేశారు. అదే సమయంలో మరికొన్ని నిధులు అదనంగా విడుదల చేసి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులంతా వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. కాసేపు పార్కులో సేదతీరిన తర్వాత జిమ్ చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటులో ప్రభుత్వం చొరవ అభినందనీయం.

–ఎస్.వేణుగోపాల్, సత్యనగర్ కార్యదర్శి.

సర్వాత్రా హర్షం



ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చాలా కీలకమైన నిర్ణయాలు తీసుకుంటుంది. గతంలో పార్కుల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కాదు. ప్రస్తుతం ప్రతీ పార్కులోనూ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటవుతున్నాయి.

– మెంటి మహేష్, చినముషిడివాడ



సత్యానగర్‌లో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు

ఆరోగ్యం మెరుగు



మా ప్రాంతంలోని ఖాళీ స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో కాలనీలోని యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇన్నాళ్లూ వ్యాయామం కోసం ప్రవేటు జిమ్‌లకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో చాలా మంది యువత వ్యాయామానికి దూరంగా ఉండేవారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసిన తర్వాత అంతా వినియోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వం చాలా మంచి నిర్ణయాలు తీసుకుంటుంది.

–రాపర్తి గణేష్, ఎస్సీబీసీ కాలనీ, చినముషిడివాడ.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'



ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హేమసుందర్రావు చెప్పారు. దీనికి సంబంధించి 15 ఏళ్లు దాటిన వారంతా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం విలేకరులతో కార్యక్రమం వివరాలు వెల్లడించారు. ఖోఖో,కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో డిసెంబరు 15 నుంచి 20 వరకు వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకు నిర్వహిస్తారని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో జనవరి 5 నుంచి 10 వరకు, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి 21 వరకు, స్టేట్ లెవెల్‌లో జనవరి 22 నుంచి 26 వరకు జరుగుతాయని చెప్పారు. ప్రతి గేమ్‌కు రెండు జట్లు ఉండాలన్నారు. కబడ్డీ జట్టుకు 12 మంది, ఖోఖో జట్టుకు 16 మంది, క్రికెట్‌కు జట్టు 16 మంది, వాలీబాల్ జట్టుకు12 మంది, బ్యాడ్మింటన్ జట్టుకు ఇద్దరు చొప్పున క్రీడాకారులను ఎంపిక చేస్తారని తెలిపారు. గెలుపొందిన జట్లకు ప్రైజ్‌మనీ అందజేస్తారని చెప్పారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో అనకాపల్లి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితితో పాటు పలు అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టాల్సిన కార్యా చరణను వివరించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమ బాటలో నడుస్తున్న సీనియర్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నీటిపల్లి ముత్యాలు,దువ్వి దుర్గాలు,బొర్రా జయరాజు,కోటి అప్పారావు,రాజుబాబు,చిన్న అప్పారావు,మంగరాజు,మల్లిబాబు,సన్యాసి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: సంక్షేమం,అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని అమృతపురంలో సర్పంచ్ బైలపూడి గౌరి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్,పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సచివాలయం వద్ద పార్టీ జెండా ఎగుర వేసి సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సూర్యకుమారి ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. సంక్షేమ,అభివృద్ధి పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. మండల పార్టీ కన్వీనర్ కర్రి బాబు , ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,ఈవోఆర్‌డీ మహేష్, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, కొటాన రాము,సబ్బవరపు ముత్యాలనాయుడు,బైలపూడి రామారావు,బోను గంగునాయుడు పాల్గొన్నారు.

విశేషంగా వరుణ జపాలు

నేడు సహస్ర ఘటాభిషేకం



వరుణ జపాలు నిర్వహిస్తున్న వేద పండితులు

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో మంగళవారం వరుణ జపాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్రంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలతో సుభీక్షంగా ఉండాలని త్రిపురాంతకస్వామి ఆలయంలో ఈనెల 27వతేదీ నుంచి ఐదురోజుల పాటు వరుణ జప హోమం నిర్వహణకు సంకల్పించారు. దీనిలో భాగంగా 27వతేదీ సోమవారం సాయంత్రం ఈకార్యక్రమానికి అంకురార్పణ చేశారు. మంగళవారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశ స్థాపన, రుద్రాభిషేకం, వరుణజపం నిర్వహించారు. దేవస్థానం వేద పండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకుడు రమణమూర్తి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడోరోజు బుధవారం ఉదయం 11గంటలకు సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



నాయీబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం

పెందుర్తి: వేపగుంట నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. చీమలాపల్లిలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా అవడివరపు మహేష్, ఉపాధ్యక్షుడిగా వడ్లపూడి వినోద్, కార్యదర్శిగా మేడిశెట్టి శ్రీను, సహాయ కార్యదర్శిగా మల్లువలస రాంబాబు, కోశాధికారిగా వడ్డాది సన్యాసిరావు, సహాయకోశాధికారిగా విజనగిరి వాసు, సభ్యులుగా మల్లువలస తాతబాబు, రాజాన రమేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

థీమ్ పార్కు పనులు వేగవంతం



రత్నగిరినగర్ పార్కు పనులపై అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభం నాటికి జీవీఎంసీ 95వ వార్డు రత్నగిరినగర్ స్పోర్ట్స్ థీమ్ పార్కును అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు అధికారులకు సూచించారు. రత్నగిరినగర్‌లో రూ.1.94 కోట్ల నిధులతో నిర్మిస్తున్న స్పోర్ట్స్ థీమ్ పార్కు పనులను మంగళవారం దేముడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. జీవీఎంసీ ఈఈ బి.వి.ఆర్ మూర్తి, డీఈ విజయ్‌కుమార్, ఏఈ దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్, నాయకులు ఆకుల గుణాకర్, కంచిబోయిన సంతోష్, సుంకర విజయ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం భవిష్యత్ తరానికి స్ఫూర్తి



రిలే దీక్షలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1020వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు కూర్చొన్నారు. కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాటం ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని.. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటం చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణ త్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ.. దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

వాహనాల వేలం నేడు

మద్రిపాలెం: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన నాలుగు చక్రాల వాహనాలను వేలం వేయనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) గోపాలపట్నం సర్కిల్-4 సీఐ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ ఎన్ఆర్ ఫంక్షన్ హాలు పక్కన ఉన్న గోపాలపట్నం సర్కిల్-4 కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు.





23 ఆటోలపై కేసుల నమోదు



స్కూల్ ఆటోను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారి

గోపాలపట్నం: స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. కొమ్మాది, ఎండాడ, ఉప్పాడ ప్రాంతాల్లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 23 ఆటోలు, ఓ స్కూల్ బస్సుపై కేసులు నమోదు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో 130 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. అలాగే పలు ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. స్కూల్ ఆటోల్లో అధిక శాతం మంది పిల్లలు ఉంటున్నారని, ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎంవీఐలు ఐ.వేణుగోపాలరావు, బాలాజీరావు, రాజారావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.